బిళ్లల మొలత్రాడు

[కథ]

•

= శ్రీ 'కరుణకుమార' =

పల్లిపోతువారిది చాలా ప్రఖ్యాతిచెందిన కుటుంబం. రామిరెడ్డితండ్రి పల్లిపోతు కృష్ణారెడ్డిని గురించీ, అతనితండ్రి వెంకురెడ్డినిగురించీ రెడ్డిగారి పల్లెలో ఇప్పటికీ కథలు చెప్పుకొన్నట్టు చెప్పుకుంటూఉంటారు. ధాతకరువులో వెంకురెడ్డి బీదలకు చేసిన అన్నదానం, గ్రామానికి ఆధారభూతమైన చెరువు వర్షాకాలంలో గండిపడి ప్రజలకీ, పైర్లకీ అపాయం కలిగే స్థితిలో ఆరెడ్డి ఒక్కడూ చెరువు కట్ట కాపాడడానికి చేసిన కృషీ, బాటసార్లు బసచేయడానికి కట్టించిన ధర్మసత్రాలూ — ఏమేమిటో ఆరెడ్డినిగురించి రైతులు తలుచుకోని రోజుండదు.

కృష్ణారెడ్డికూడా అరవయినాలుగేళ్లు జీవించి షష్టిపూర్తిఉత్సవం చేసుకొని తన హయాం గౌరవంగానే గడుపుకొన్నాడు. కాశీ, రామేశ్వరం వగైరా తీర్థయాత్రలు సేవించి గ్రామంలో రామలింగేశ్వరస్వామికి ఏకాదశరుద్రాభిషేకం చేయించి, అష్టాదివర్ణానికీ బ్రహ్మాండంగా భారద్వాజవిందు చేశాడని అతన్ని బీదలు అమితంగా తలుచుకొని దణ్ణం పెట్టుకొంటూఉంటారు.

కృష్ణారెడ్డికి నలుగు రాడసంతానం తర్వాత కలిగిన పిల్లవాడు రామిరెడ్డి. తాను జీవించి ఉండంగనే నలుగురు కూతుళ్లనీ సంపన్నగృహస్థుల యిండ్లలో యిచ్చి వివాహాలుచేసి, తర్వాత కొడుకు రామిరెడ్డికి కూడా ఓ అయినయింటి పిల్లని పెళ్లిచేసి అయిదారేళ్ళ క్రిందటనే కాలంచేశాడు కృష్ణారెడ్డి. చిరకాలానికి కలిగిన మొగపురుగుకాబట్టి రామిరెడ్డి అంటే ఆతల్లికీ, ఆ తండ్రికీ అబ్బురంగా ఉండడంలో ఆశ్చర్యంలేదు. స్వార్జితపిత్రార్జితాలు నూరెకరాలు. మాగాణీభూమి గాక, రామిరెడ్డికి దౌహిత్రరీత్యా సంక్రమించిన ఏభయ్యెకరాల మాగాణీ మెట్టలూ, పశువులబీడూ, ఆవులూ, కోడెలూ - సమస్తమూ అమిర్చి పెట్టినట్టు చేతిలోపెట్టి మరీ కాలంచేశాడు కృష్ణారెడ్డి. ఈఆస్తి గాక భేషయిన రెండు మండువాల లోగిలీ, ధాన్యపుకొట్లూ, దొడ్లో అరటితోటా, కొబ్బరితోటా, ఆడవాళ్ల వంటిమీద బంగారునగలూ, వెండిసామానూ— ఒకటేమిటి, సిరి అందుకోనంతకాలమేగాని, అందుకొంటే ఆతల్లి అనంతమైన ఆకారాలతో అవతరిస్తుంది.

రెడ్డిగారి పల్లెలో గల నూటఏభయి లేతకాపుల కుటుంబాలలోనూ రామిరెడ్డికుటుంబం మకుటాయమానంగా ప్రకాశించిపోతోందని ఇక వేరే చెప్పాలా! రామిరెడ్డికి ఇంటా, బయటాకూడాకావలసినంత బలం, బలగమూను. ముప్ఫయ్యేండ్లయినా నిండని వయస్సూ, తండ్రి సంపాదించి యిచ్చిపోయిన ఆస్తీ, గ్రామంలోని రైతాంగం యావత్తూ తనకి బీరకాయపీచుచుట్టరికం, పైగా వంశపారంపర్యంగా వస్తున్న గ్రామమునసబుఅధికారం — బంగారానికి వలిగారం అతికినట్లు ఒక దాని కొకటి అతుక్కొని అతని జీవితాని కందమే కలుగచేస్తున్నవి.

తాత తండ్రులు సంపాదించియిచ్చిన ఐశ్వర్యం ఎంత ఉన్నప్పటికీ అసలు జన్మతః మనిషిలో ఒక

విధమైన తెలివీ తేటా, డాబూ దర్పం ఉండకపోతే ఆ ఐశ్వర్యానికిగాని, అతగాడి జీవితానికిగాని రాణింపూ ఎన్నికా సిద్ధించదు. భగవంతుడు రామిరెడ్డికి ఆ కొరతా తీర్చాడు. ఆ మాటకి వస్తే అతగాడి చలాకీకీ, అతని ఆలోచనలకీ, దర్జాకీ తగిన ఆస్తి కానేకాదేమో ఆ తండ్రియిచ్చిన ఐశ్వర్యం.

వొళ్లువిరుచుకొని పెద్దచదువులు చదివి ఉద్యోగాలూ ఊళ్లేలడాలూ అవసరంగల కుటుంబం కాదు కాబట్టి, ప్రస్తుత కాలమానాన్ని బట్టీ, సంప్రదాయాన్ని బట్టీ స్కూలుఫయినలు వరకూ మాత్రమే చదివి పరీక్షకు కూర్చొని ఫేలయి ఊరుకున్నాడు రామిరెడ్డి. ఫేలయిన పరీక్ష ఎంగిలికూడువతుగా తోతనిపించి దానిని కాలిచెప్పును విసర్జించినట్లు విసర్జించి, తండ్రి గతించినవెనుక సంక్రమించిన సంసార భారాన్ని భుజాన వేసుకొని ఈదులాడుతున్నాడు.

ఈదులాడడానికి-రామిరెడ్డి కీ సంసారం ఒక లెఖ్ఖా, జమా, ఖర్చా? అందులో యుద్ధంవచ్చి బ్లాకుమార్కెట్టులో పుట్టి నూటఏభయి, రెండువందలూ వడ్లు అమ్మే రోజులేమో—అతను పట్టినదల్లా బంగారంముద్దయిపోతోంది. చేటలో వడ్లగింజ పడవేస్తే బంగారాన్ని బలికోరుతోంది. ఏరువాక తిరిగి ఏరువాక అందుకొనేసరికి, కుప్పలమీదనే బేరం తెగ్గొట్టి సంవత్సరానికి హీనపక్షం ఇరవయినుప్ఫయి వేలదాకా ఇనప్పెట్టెలో విసిరిపారేస్తున్నాడు.

పేరుకు పెద్దకుటుంబం అన్నమాటేగాని, ఇంట్లో తినేవాళ్లు మాత్రం ఎవరున్నారు? తనూ, తన భార్యా, తల్లీని. ఒక కొడుకూ, ఇద్దరు కూతుళ్లూ తనకి కలిగారుగాని, వాళ్లింకా కసుగాయలు. ఎటువచ్చీ ఈ రెండువందలెకరాల కమతమూ, సేద్యం నాద్యం, గొడ్డూ గోదా, దూడా దుడికీ—వీటిమీద అజమాయిషీచేసుకొంటూ కయ్యలో పండిన ధాన్యం గడపలో చేరేవరకే అతగాడికి తాపత్రయం. ఈ తాపత్రయం కూడా లేకుండా కరుణించి యానాది సుబ్బడిని రామిరెడ్డికి ప్రసాదించాడు భగవంతుడు.

ఇంతలావు కమతంమీదా సుబ్బడు, అహోరాత్రస్య, కంటిలో వత్తివేసుకొని, గడ్డిపోచకూడా అన్యాక్రాంతం గాకుండా కాపాడుతున్నాడు. సుబ్బడు రామిరెడ్డికి గుండెకాయ అయిపోయినాడు.

౨

సుబ్బడు మంచియానాదివాడు. యానాదులలో. మంచి యానాదులనీ, చల్లాయానాదులనీ రెండు తెగలు. చల్లాయానాదులు ఎంగిలివిస్తరాకులలో పారేసిన కూడు తింటారు—మంచియానాదులు తినరు.

సుబ్బడి తండ్రి పాపడు కృష్ణారెడ్డితండ్రి హయాంనుండీ ఆకుటుంబాన్నే అంటిపెట్టుకొని జీవించాడు. చిన్నతనంలో పాపడు వెంకురెడ్డి ఎక్కే తెల్లగుర్రాన్ని మేపుతూ, మాలీసుచేస్తూ నౌకరీచేసేవాడట. వెంకురెడ్డి ఆగుర్రం ఎక్కి ఏ ముసాఫరుకు వెళ్లినా ఆగుర్రంవెంబడే పాపడుకూడా వెళ్లవలసినదేనట. గుర్రంనడకతో నడకా, తరటుతో తరటూ, గాలపుతో గాలపూ—దాని తోక పట్టుకొని ఎంతదూరమైనా కూడా పరుగుతో పోయేవాడట పాపడు. వెంకురెడ్డి గతించినతర్వాత కృష్ణారెడ్డి గుర్రపుస్వారీ చేసే రోజులలోకూడా పాపడు అదేప్రకారం ఖామందువెంట పోయేవాడటగాని, కొంతకాలం గడిచేసరికి పాపడికి ఈపరుగువల్ల గుండెజబ్బు ఏర్పడి ఖాయిలాతో మంచానబడేవరకు, కృష్ణారెడ్డికి మనస్సు కరిగి, ఇంక తాను గుర్రం ఎక్కడం లేదని వొట్టుపెట్టుకొని ఆగుర్రాన్ని అయినకాడికి అమ్మిపారేశాడని అనుకొంటా రాగ్రామంలో. మొత్తానికి పాపడు జీవించినన్నాళ్లూ పల్లిపోతువారి కుటుంబాన్నంటిపెట్టుకొనే జీవించి కృష్ణారెడ్డికంటే పదేళ్లు ముందుగా వాడు చనిపోయినాడు. పాపడు జీవించిఉండంగనే కలరా తగిలి చనిపోయింది వాడి భార్య చెంచి. చెంచి చనిపోయేవరకు సుబ్బడి కయిదోఏడు.

పాపడికీ, చెంచికీ కలగడానికి ఓ అయిదారు గురుపిల్లలు కలిగారుగాని ఏంక్రియ? చెంచి చని

పోయేవరకు పాపడికి దక్కిన బిడ్డడు సుబ్బడొక్కడే. తల్లి లేని ఆ అయిదేళ్ల పిల్లవాడుకూడా గతించిన సంతానంలాగునే తనకు దక్కడని పాపడు నిరాశ చేసుకొని వాడిని పెంచడానికి చేతగాక ఒకమారూ, కష్టమనిపించి ఒకమారూ 'సుబ్బడివిషయమై తాను తాపత్రయపడేవాడే కాదు. రాత్రిగాని, పగలుగాని తనేదయినా పనిమీద పోవలసిఉంటే, సుబ్బడిని ఏ గడ్డివామిలోనో పండబెట్టి గడ్డికప్పి వెళ్లిపోతుండేవాడు. చెంచి గతించిన తర్వాత సుబ్బడి యోగక్షేమాలు కృష్ణారెడ్డిభార్య లక్ష్మమ్మ పాపణ్ణి అప్పుడప్పుడు విచారిస్తూ ఉండినప్పంటికీ, ఆ కుర్రకుంక గడ్డివాముల్లో పెరుగుతుండినట్టు ఆమెకు తెలియదు. తన దొడ్డిలో అరటితోటలోని గుడిశలో పాపడిచేతుల్లో పెరుగుతున్నాడనే ఆమెగమనం.

ఒకనాడు ఉదయం లక్ష్మమ్మ తన పశువుల దొడ్డిలో ఆవుపాలు తీయించడానికి పోగా, గుంజకు కట్టిన ఆవు మేతమేయడం చాలించి కొమ్ములతో ఆ తట్టుగా లాక్కొని బుస్సుమంటూ మీదపడుతోంది. మళ్లా అంతలోనే గడ్డివేసిన గాటిలో దేనినో నాలుకతో నాకుతోంది. లక్ష్మమ్మకి అర్థంగాక సమీపించి చూచేసరికి, ఆ తట్టు నల్లని కృష్ణసర్పం ఒకటి గజంఎత్తున పడగఎత్తి చీలిన నాలుకలు చాచి బుస్సుకొట్టుతూ తల నేలనేసికొట్టుతోంది. ఆవు తిరిగీ కొమ్ములతో కుమ్మబోయి గాటిలో నాలుకతో నాకుతోంది. పామును చూచేసరికి 'అమ్మో'అని అరిచింది లక్ష్మమ్మ. ఎత్తిన పడగ దించి పడమటగా పాకిపోయింది సర్పం. గాటిలో ఆవు నాకుతూ ఉండిన అయిదేళ్ల పిల్లవాడు- సుబ్బడు - కళ్లు నులుముకొంటూ లేచికూర్చున్నాడు. ఆమె గుండెలు కొట్టుకొని వాణ్ణి ఇంట్లోకి తీసుకొనిపోయి, ఆ క్షణంలగాయతు సుబ్బడు తన తండ్రితో ఉండడానికి వీలులేదని, వాణ్ణి తన యింటిలోనే పెట్టుకొని, కొడుకు రామిరెడ్డితో సమానంగా పెంచుతూ వచ్చింది లక్ష్మమ్మ. తనకి సగంపీడ వదలిందని తల తడుముకున్నాడు పాపడు.

సుబ్బడికి పదేళ్లు వచ్చేవరకూ బ్రదికాడు పాపడు. వాడు గతించిన తర్వాత సుబ్బడికి కృష్ణారెడ్డి తండ్రీ, లక్ష్మమ్మ తల్లీ, రామిరెడ్డి అన్నా అయిపోయినారు.

ఆ సంసారంలో తన కేమికొరత? వేళకు పిడికెడు మెతుకులు. కాస్త గ్రాహ్యం తెలిసే ఈడు వచ్చేవరకు, ఇంట్లో పాడిపశువులను బయటకు తోలుకొనిపోయి మందబయట తిప్పుకొనివస్తుంటే ముప్పూటలా కడుపునిండా అన్నం పెట్టుతూనే ఉన్నది లక్ష్మమ్మ. రామిరెడ్డి బడికి పోతుంటే సుబ్బడు అతగాడి పుస్తకాలు బడికి తీసుకొనిపోయి, తాను బర్రెగొడ్లను బయటికి మళ్ల వేసుకొని వస్తున్నాడు.

కాలం పెరిగినకొద్దీ ఇటు రామిరెడ్డీ, అటు సుబ్బడూకూడా పెరుగుతున్నారు. ఇద్దరి వయస్సులో నాలుగయిదేళ్లు తేడా ఉండినప్పంటికీ,యుక్తవయస్సు వచ్చేసరికి పొడగట్టిన యౌవనంలో మాత్రం అట్టి తేడాలు కనిపించడంలేదు. రామిరెడ్డి కేమి-మహారాజు బిడ్డ. ఇరవయ్యేళ్లు నిండకుండానే తండ్రి బంగారువంటి పిల్లని పెండ్లిచేసి పెద్దవాణ్ణి చేశాడు.

ఒకఏడుమీద మరొక ఏడు పడేవరకు, సుబ్బడు, పద్ధెనిమిదేళ్లకే పాతికేళ్ల మనిషిలా తయారయినాడు. వీథినబడి పోతూంటే వాణ్ణిచూస్తే దిష్టి తగులుతుందేమోనన్నంత భయం కలుగుతోంది. నల్లని జీడిగింజరంగు శరీరం నిగనిగ మెరిసిపోతోంది. సృష్టిలోని యౌవనం కరిగించి పోసిన విగ్రహం—ఉక్కుగుండులా బిరుతేలింది ఆకారం. రెండు హస్తాలూ జోడించి పట్టినగాని అందడంలేదు కండలు తిరిగిన దండలు. ఆ యీడుకే ఆరడుగుల ఎత్తు-ఆజానుబాహువయిపోయినాడు సుబ్బడు. మూతిమీద నూనూగు మీసం, కళ్లమీద కనుబొమలు సన్నని నల్ల మొఖమల్ పట్టులా నిగారింపుతో మిరుమిట్లు గొలుపుతున్నవి. ఆ ముఖవికాసంలో తెల్లని నేత్రాలు వాని ఆకారానికి ఎంతశోభ తీసుకొనివచ్చినవి! పురుషునికిగాని, స్త్రీకిగాని నవయౌవనంకంటె మించిన ఐశ్వర్యం మరొకటేమున్నది?

తన చేతుల్లో స్వయంగా పెంచిన లక్ష్మమ్మకే గాదు, అసలు గ్రామంలో అశేషజనానికీకూడా సుబ్బడు యానాదివాడన్న సంగతి విస్మృతిలో పడిపోయింది. అటువంటి మనిషి యింట్లో తిరుగుతుంటేనే చాలునన్నంత మోహనంగా ఉన్నది వాడి మోహనాకారం. అటువంటి సుబ్బడు తనకు బానిసీడు, తన బంటు అయినాడంటే రామిరెడ్డి కెంత గర్వం!

సుబ్బడిమీద పెరిగిన ప్రేమవల్ల లక్ష్మమ్మ వాణ్ణి 'సుబ్బులూ' అని ముద్దుగా పిలుచుకోవడమేగాని 'సుబ్బా' అని పిలవడం కొన్నిఏళ్లుగా మరచిపోయింది. అదిగాక వయస్సువచ్చి పెద్దవాడవుతుండినందువల్లా, వానియందు పొడగట్టిన పెద్దగుణములవల్లా, లక్ష్మమ్మకే గాదు గ్రామస్థులకు కూడా వానియందు గౌరవమూ, ప్రేమా ఏర్పడి, ఎవరు పిలిచినా 'సుబ్బులూ' అనే పిలుస్తూ వస్తున్నారు.

సుబ్బులుది మొండిధైర్యం. నదురులేదు, బెదురు లేదు. రాత్రి ఎరగడు, చీకటి ఎరగడు. పామెరగడు, పురుగెరగడు. అర్ధరాత్రి జోరున పిడుగులుపడే వర్షంలోనయినా పొలం పోవలసిఉంటే ఒక్కడూ ఆపనిమీద పోవలసినదే. రెండేళ్లక్రిందట రాత్రిపూట పొలంలో వడ్లకళ్లందగ్గర ఒంటరిగా పండుకున్నప్పుడు, ప్రక్కన కాపలాకాచే కుక్కని పట్టుకోను వచ్చిన చిరతపులిని చేతిబరిశె తీసుకొని పొడిచిన పోటుకు, అంతలావు పులీ ఆవులించి ప్రాణంవిడిచింది. బరిమీద పరుగుపెట్టే తాచుపామును తోకపట్టుకొని నేలవేసి కొట్టుతానని బయలుదేరుతాడు. అట్లతద్ది పండగకి, అమ్మవారి దేవళాని కెదురుగా మర్రిచెట్టు కొమ్మకు కట్టిన ఉయ్యాల ఊగడానికి వచ్చిన అట్లతద్ది ఆడపడుచులను ఉయ్యాలలో కూర్చోబెట్టి జనపనార మోకు పట్టుకొని ఊపడంలో, ఉయ్యాలతో గూడా ఆకాశంవరకూ లేచి సుబ్బులు క్రిందికి దూకుతుంటే ధణా ధణా అని అదిరిపోతుండేది భూమి. వానిచేత ఉయ్యాల ఊపించుకోను ఆవూరి కాపుపడుచుల కెంత మనసు!

ఇక వ్యవసాయకృషిలో సుబ్బులుకు తెలియని పనిలేదుగదా! అటు వడదుక్కిలోగాని, ఇటు రొంపిదుక్కిలోగాని, వాడు కయ్యలోదిగి నాగేటి మేడితోక పట్టుకొంటే, పదేసివందల రూపాయలు కిమ్మతుచేసే రెడ్డిగారి పెద్దఎద్దుల జతకూడా గడగడలాడి పోవలసిందే. వాడి చేత్తో గుంటక తోలి, నల్లమానూ, కర్రలమానూ ఒక్కసారి అట్లా ఆడిస్తే చాలు — నుసుకు అంతా పోయి కయ్య అలాఉండవలసిందే. నాగేలిఅర్రు మీదపెట్టి, వారిణబిగించి, పణతకొయ్య ఆరుపట్టుకొని, వాడు చాలు దోలితే, ఒక్క మడకతోనే కయ్య పదును తేలి చాడ వేసుకోవచ్చు. విత్తనం ఏ అదున్న చల్లాలో, ఏ అదునులో యారాలుకట్టి పులకవాముడుతీసి కయ్య ఆరగట్టాలో - సుబ్బులుకు తెలిసినట్లు మరొక సేద్యగాడికి తెలియదని అనుకొంటారు. సరిగదా, ఏరువాక వచ్చి, విత్తనాల పట్టులో గింజ చల్లాలంటే, వినాయకుడికి పెట్టుకొని ముందు సుబ్బులుచేత్తో గింజ చల్లిస్తుంది లక్ష్మమ్మ. వాడిచెయ్యి పట్టితే బంగారుపండుతుందని గ్రామంలో ప్రతీతి.

పుట్టుకలగర కట్టి మిట్టలు తేలబెట్టుతాడు. మోపు పైకిలేచేసరికి రెండు, మూడు కలగరలు పెట్టి నీళ్లు నిలవేస్తాడు. వ్యవసాయంపను లారంభించిన గడియ మొదలుకొని, ఆపైరు ఫలితానికి వచ్చి, పండిన గింజలు ఇంట్లోకి చేరేవరకూ సుబ్బులుకు నిద్రపట్టదు. ఎక్కడెక్కడ ఏయే కయ్యలో నీళ్లు పులక తేలిపోయాయో, ఏ కయ్య ఆరగట్టాలో, ఏకయ్యకు నీళ్లు ఎద్దడయినాయో — అబ్బ! సుబ్బులుకున్న మెలకువ రామిరెడ్డి కేదీ! మొలకచేనుమీద రాత్రిళ్లు చిలవ పక్షులు వాలకుండా కిరసనాయిలుడబ్బా చేతపట్టుకొని తెల్లవారులూ అట్లా రాంభజన చేస్తూనే ఉంటాడు సుబ్బులు.

ఒక్కటేమిటి - వరినాట్లు అయిన క్షణాలగాయతు సుబ్బులుకు కయ్యలోనే కాపరం. రెడ్డిగారి చేలో ముళ్లపాచి కనిపించిందంటే వానికి వంటిమీద ముళ్లుగుచ్చుకొన్న ట్టుంటుంది. తుంగా, గాబా,

ఊదరా కోయించి, కలుపు తీయించేవరకూ ఊరుకోడు. కయ్యల్లో పైరు పాలుపోసుకొని, సుంకు మీద పొట్టతేలి, కరుగు మోపిందనేవరకు - ఇక సుబ్బులుసంతోషం చెప్పలేము. కరుగు మోపిన పైరు ఎర్రబారి, అర్రుషంచిందనంగనే - మంచిరోజు చూచుకొని, రెడ్డిగారిచ్చే కొత్త పంచలు కట్టుకొని, ముఖాన్న కుంకుమ అద్ది, కయ్యలో వంగి, మూడు పిడికిళ్లు పిడితరిగి, వినాయకుడికి వోదవెయ్యడం ఎప్పుడబ్బా అని వాడికి ఒకటే కలవరింపు. పైరు కోతకి వచ్చిందనేసరికి, వడ్లాబత్తుడు అచ్చయ్య కొలిమికాడికి పోయి, దగ్గర ఉండి ముందు తన కొడవలికి చందనపు పిడీ, ఇత్తడిపొన్నూ తరిమిణి పట్టించి కక్కుకోసి సరిపించేవరకూ వాడికి స్తిమితమేదీ? పొలం పని అంటే ఆ సంతోషమేమో చెప్పలేము. పుష్యమాసంలో పెద్దపండగ చేసుకొని, వరికోతలకు జనం వొంగుతున్నారనంగనే - ఎప్పుడు చేయించిపెట్టాడో వెయ్యిపనకట్టలు పేడించిపెట్టాడు సుబ్బులు. అట్లాకోసిన పన, వోదలేసేవాళ్లు వేస్తుంటే, ఇట్లా కుప్పలువేసేవాళ్లు వేస్తుండవలసినదే. ఇంతలావు కమతంమీదా ఎక్కడుంటాడో, పనివాళ్లని వెయ్యికళ్లతో కనిపెట్టుకుంటాడు. కుప్పవేయడంలో పనివాళ్లు బద్ధకించి ఎగాదిగా వేసినట్టు కనిపించినా—చేతిలో తట్టుపలకా, తనూ తయారు. కరుగూ, అద్దా, చూరూ_ తను స్వయంగా వచ్చి, తట్టితేనేగాని వానికి తృప్తి లేదు. సుబ్బులు కప్పిన కుప్ప ముద్దులుమూటకట్టుతుందని ఆవూళ్లో పెద్దపెద్ద ఖామందులే వాడికి కితాబులు చెల్లించారు.

రెడ్డిగారి కమతంలో ఉండడాని కింకా ఉన్నారు తలమనుష్యులూ, సేద్యగాళ్లూను. కాని వాళ్లందరికీ సుబ్బులంటే సింహస్వప్నం. వొళ్లుదాచి పనిచేయడానికి వాళ్లకి గుండెలేవీ? ఒకానొక పట్టులో రామిరెడ్డి నయినా కళ్లుగప్పడానికి వీలున్నదిగాని, సుబ్బులుని మరిపించడానికి వాళ్లకు వీలేదీ?

3

సుబ్బులుకు పాతికేళ్లు నిండినవి. తనపసేమో—అంతే. ఇక రెండో ప్రసక్తి అతగాడికి కొబట్టదు. తనతో సమానంగా పెరిగిన రామిరెడ్డి పెళ్లి చేసుకొని అప్పుడే ముగ్గురుబిడ్డల తండ్రి అయినాడు. తన జీవితంలో యౌవనం వికసించి విజృంభిస్తోంది. సుబ్బులుకుకూడా వివాహం జరగవలసిన రోజులు.

“పిల్ల చదువు చాలించి యింటికాడనే ఉంటున్నది. ఇప్పటికే ఇద్దరికీ పెళ్లి ఈడు తప్పింది. రెడ్డిగారి మాట తీసుకొని తొందరగా వచ్చి పెళ్లి చేసుకొని వెళ్లవలసిం”దని ఏటిఅవతల కమ్మవారిపాలెంనుండి సుబ్బులు మేనమామ జువ్వడు కబురుచేశాడు. ఇంక ఆలస్యం చేయడానికి వీలులేదని, లక్ష్మమ్మదగ్గరికి పోయి, “అమ్మా!”అని పిలిచాడు సుబ్బులు.

“ఏమి నాయనా.”అన్నది ఆఅమ్మ.

“ఏటిఅవతలనండి, మా మామ నన్ను రమ్మని కబురు పంపాడు. పోయివస్తాను.”అన్నాడు సుబ్బులు.

“అక్కడ మీవాళ్లందరూ బాగున్నట్టేనా?” అని ఖంగారుపడుతూ అడిగింది లక్ష్మమ్మ.

“అందరూ బాగానే ఉన్నారు. పిల్లకి పెళ్లి చేయాలి, ఒకసారి వచ్చి మాట్లాడిపోమని కబురు చేశాడు మామ.”అన్నాడు సుబ్బులు.

“మేనమామకూతుర్ని పెళ్లి చేసుకొంటావుటరా! నాతండ్రే. తప్పక వెళ్లి, తొందరగా రా. పెళ్లికొడుకుని చేసి పంపుతా”నని సుబ్బుల్ని దీవించి పంపింది లక్ష్మమ్మ.

సుబ్బులు మేనమామ జువ్వడు మొదటినుండీ కమ్మవారిపాలెంలోనే కాపరం. రెడ్డిగారిపల్లె లేతకాపుల కెట్లా ఆటపట్టయిందో, కమ్మవారిపల్లె కమ్మవారి కావిధంగా ఆలవాలమైపోయింది. ఆవూరికీ ఈవూరికీ నడుంగా చిలకలేరు అడ్డం. ఎన్నడో ఇక్ష్వాకుల కాలంలో ఆవూరి కమ్మవారికీ, ఈవూరి రెడ్లకీ సయోధ్యత కలిగి మమేకంగానే ఉంటూవచ్చారటగాని, ఇటీవల పాతిక, ఇరవయ్యేళ్లనుండి మనస్పర్ధలేర్పడిపోయినవి. పాతికేళ్ల క్రిందట, ఎందుకు వచ్చిందో—ఈరెండుఊళ్లకీ నడుంగా ఉండవలసిన పొలిమేరనిర్ణయంవిషయంలో వారికీ వీరికీ పెద్ద తగాదా పడిందని అంటారు. చిలకలేరు ఇవతలగట్టువరకూ

మాపొలిమేరే అంటారు కమ్మవారు. అట్లాకాదు, అవతల గట్టువరకూ రెడ్డిగారిపల్లెపొలిమేరే అంటారు కాపులు. చిలకలేరునదిని పూర్తిగా తమతమ పొలిమేరల్లోచేర్చుకోవాలని ఆ ఇరుపక్షాలవారికీ పట్టుదల. ఇంతకీ, ఈపొలిమేరతకరారు రావడానికి కారణమేమిటంటే- ఇటు రెడ్డిగారిపల్లెలో ఒక చెరువూ, అటు కమ్మవారిపాలెంలో ఇంకో చెరువూ ఉన్నవి. ఈరెండు చెరువులకూ కూడా, ఊరికి పడమరగా, రెండుమైళ్లదూరంలో చిలకలేరులో ఆనకట్ట కట్టించి, ఆచెరువులోని కో కాలవా, ఈ చెరువులోని కోకాలవా—రెండు సప్లయి కాలవలు నదిలోనుంచే తవ్వించారు సర్కారువారు. ఆనకట్టకట్టు దిట్టంగా ఉండిన రోజుల్లో ఏటికి నీరు తగిలినవెంటనే ఈ రెండు చెరువుల్లోకీ నీళ్లు ధారాళంగా పోయి, సకాలంలో చెర్వులు నిండుతూవచ్చినవి. మరి రానురాను, ఆనకట్టకి మరమ్మతులు లేక శిథిలమే అయిపోయిందో, లేక అసలు వరవకాలవల అంజీపని రైతులు సరిగా చేసుకోనందువల్ల అవి పూడిపోయిన కారణంచేతనో — ఇటీవల ఏటికి ఎంతెంత వరద వచ్చినా పూర్వం నిండినట్లు చెరువులు సక్రమంగా నిండడంలేదు. దానితో నీళ్లకు ఎద్దడయి, వచ్చిన నీళ్లన్నీ తమ చెరువుకు గానీయకుండా వాళ్ల చెరువుకే పెట్టుకొంటున్నారని కాపులూ, మా చెరువుకు అసలే నీళ్లు రానీయడం లేదీరెడ్డిగార్లని కమ్మవారూ— ఒకరిమీద ఒకరు నేరారోపణలు చేసుకొని అధికార్లకు అర్జీలూ పిటీషనులూ పంపుకొన్నారు. అధికార్లు చేసిన ఉత్తర్వులు ఉభయులకూ తృప్తికరంగాక-చివరకు వాళ్లూ వీళ్లూ ఏటికడ్డంగా కలియబడి కొట్టుకొని రైటింగులూ, ఖూనీలూ చేసుకొన్నారని ఏనాటి గాథలో చెప్పుకొంటుంటారు. దానిమీద సర్కారువారేమో రెండు గ్రామాలకీ పొలిమేర సరిహద్దు ఏటికి నట్టనడుంగా పోవాలని తీర్మానించి, ఆనకట్ట దగ్గర ఏటికి నడుంగా ఒక లంకగా కట్టించి, పైనవచ్చిన నీళ్లు ఏటిలోనే రెండుభాగాలుగా పంపకం అయేటట్టు చేసి రహితపెట్టారని అంటారుగాని—ఆనాడు రగుల్కొన్న అగ్ని ఇప్పటికీ చల్లారలేదు. తదుపరి-జిల్లా బోర్డులకీ శాసనసభలకీ ఎన్నికలంటూ రావడం-వాటిలో రామిరెడ్డి ఒక పార్టీ తరపున నిలబడితే కమ్మవారు కాంగ్రెసుతరపున పోటీచేయడం - ఇట్లనే కావిపాళ్యాలు పెరిగిపోయినవి. చివరకు కమ్మవారిపాలెం కాంగ్రెసు గ్రామం, రెడ్డిగారిపల్లె ఇంకోపార్టీ గ్రామం అయి, వారిని వీరూ, వీరిని వారూ పబ్లికుగా దూషించుకోవడంలోకి దిగింది.

పాతికేళ్ల క్రిందట జరిగిన కొట్లాటకేసులో జువ్వడుకూడా కమ్మవారితరపున గలాటాలో ఉన్నాడని వాడిమీదకూడా పోలీసులు కేసుపెట్టితే, సెషన్సు కోర్టులో అయిదేళ్ల శిక్షపడి, శిక్షానంతరం విడుదల అయి యింటికి తిరిగివచ్చాడట. తమ తరపున నిలబడి కాపులమీద తిరగబడడమే కాకుండా, ఆ గలాటాలో తలమీద బలమైన గాయంకూడా తిన్నాడని కమ్మవారికి వాడిమీద అభిమానం కలిగి, వాడు తిరిగి రావడంతోటే, ఏటివొడ్డున మంచి వొనరయిన స్థలంలో వాడి కోయిల్లు కట్టించి, రెండెకరాల మాగాణీ కయ్యకూడా తీసియిచ్చారు. వాడి కొడుకు-సుబ్బులు ఈడువాడే-యిటీవలదాకా ఇంట్లోనే ఉండి ఆ కయ్య దున్నుకొని తండ్రినీ, తల్లినీ పోషిస్తూఉండేవాడు. కాని యుద్ధంవచ్చిన కొత్తల్లో వాడు ఎవరితోనూ చెప్పకుండా చెన్నపట్నంవెళ్లి మిలిటరీలో చేరిపోయాడు. జువ్వడికి ఆ కొడుకు తర్వాత ఒక్కతే ఆడపిల్ల-రమణి. మిలిటరీలోకి పోయినకొడుకు నెలకు పదీ పదిహేనూ ఇంటికాడ తండ్రికి పంపుతూనే ఉన్నాడు. అయితేనేం-జువ్వడు, పెద్దవాడయిపోయి కళ్లు కనిపించక, సేద్యం నాద్యం చేసుకోలేక, కూతురు రమణిని మేనల్లుడు సుబ్బులుకిచ్చి వివాహంచేసి, వీలయితే వాణ్ణి కమ్మవారిపాలెం పిలిపించుకొందామని ఆశపడ్డాడు.

జువ్వడికొడుకు మిలిటరీకి పోకపూర్వమే, కమ్మవారిపాలెంలోని కాంగ్రెసునాయకులు ఆ గ్రామంలో హరిజనులకు, కేవలం పతితులయిన యానాదులకు కాలనీలు కట్టించి, వాండ్ల విద్యాభివృద్ధికి పాఠశాలలు నిర్మించి, సర్కారువారివల్ల అంగీకారమూ

గ్రాంటూ సంపాదించిపెట్టారు. నలుగురుతోపాటు రమణికూడా ఆ పాఠశాలలో ప్రవేశించి చదువుకొన్నది.

ఇప్పుడు రమణికి పద్దెనిమిదేండ్లుంటాయి. యుక్తవయస్సు వచ్చింది. ఎనిమిదో తరగతి ప్యాసయింది. చదువుతోపాటు పాఠశాలలో అల్లికా, కుట్టూ, రాటంమీద నూలుతీయడం, పాటా పద్యం నేర్చుకొన్నది.

౪

లక్ష్మమ్మదగ్గర శెలవుతీసుకొని సుబ్బులు కమ్మవారిపాలెం బయల్దేరి వెళ్లాడు. పిల్ల రమణిని చూచుకొన్నాడు. అదివరకు అప్పుడప్పుడు మేనమామగారింటికి వెళ్లి ఒకపూటో అరపూటో ఉండడం, మంచి శబ్బరలు మాట్లాడుకొని తిరిగిరావడం జరుగుతూనే ఉన్నది. ఈసారి మాత్రం బొత్తిగా తీరికలేక సుబ్బులు కమ్మవారిపాలెం వెళ్లి ఆరునెలలయినట్టయింది. ఇంతకాలం చూడక ఎడమయిన కారణం వల్లనో ఏమో-ఇప్పుడు చూచుకుంటే అతని కళ్లకి విస్తుకలిగిస్తోంది రమణి. తనకంటె ఏడెనిమిదేళ్లు చిన్నవయస్సయినప్పంటికీ ఆ పిల్ల తన భుజాలు దాటి చెవిగూబలవరకూ పోటీచేసేటట్టు ఏపుగా పెరిగిపోయింది. మనిషిలో పూర్వపు పసితనపు పచ్చివదలి నేవళం కమ్ముకొని, చామనచాయ చెక్కిళ్లలో కొత్తరక్తం ఉబికి పన్నీరుపుష్పాన్ని ప్రతిఫలింపజేస్తోంది. మెడ బోసిమెడ అయినా, ముతకఖద్దరు చీరమాటున కంటిమెడజాకెట్టువలయంలో, కంఠంలో రేఖ లేర్పడి ముద్దులుమూటకట్టుతున్నవి. సన్నని ఎర్ర జీర ఏర్పడిన ఆమెవిశాలమైన నేత్రాలలో, యౌవనపు సిరి పరిపూర్తి చెంది తొణికిసలాడుచున్నది. ఆరమణికి ఇంక అలంకారము లెందుకు, నగ లెందుకు? ఆమె మనోహరరూపము చూచేసరికి సుబ్బులుకు ఒక్కపెట్టున అనంతమైన కొత్తకోరిక లుబికి, పొంగి పొర్లిపోతున్నవి. సుబ్బులు గడపలో కాలిడిన వెంటనే—

“మామా! కాళ్లు కడుగుకో!”అని మట్టిముంతతో నీళ్లుతెచ్చి దగ్గరపెట్టింది రమణి.

వెళ్లి నాలుగుమాటలు మామతో మాటలాడి రాత్రికే యింటికి తిరిగిరావాలని వెళ్లాడుకాని, వెళ్లినతర్వాత ఆరాత్రి నిలబడి, మామతోనూ; అత్తతోనూ, రమణితోనూ సావకాశంగా ముచ్చటించనిది, వదలిరా బుద్ధి పుట్టలేదు సుబ్బులుకు. రాత్రి అన్నాలవేళ ముసలివాడు పెండ్లిమాట తలపెట్టి, పిల్లని ఇక నిలపడానికి లేదు, తొందరగా పెళ్లిచేసుకొని, కమ్మవారిపాలెం లేచి రావలసిందని ఆరంభించాడు. పెండ్లిచేసుకోడానికి మాత్రం వెంటనే అంగీకారాన్ని తెలుపుతూ, రెడ్డిగారిపల్లె విడిచిపెట్టి రావడంమాత్రం తనవల్ల కాదని స్పష్టంగాచెప్పేడు సుబ్బులు. వాడు కమ్మవారిపాలెం కాపరంరాకపోతేమాత్రం తన కూతుర్ని సుబ్బులుకివ్వడం తప్పుతుందా? “వెంటనే వెళ్లి పెళ్లికి లగ్నం రెడ్డిగారిపల్లెలోనే ఖాయపరచుకొని రావలసిం”దని కోరాడు ముసలివాడు.

ఆరాత్రి భోజనాలయినతర్వాత పొద్దుపోయేవరకూ ఏవో యుద్ధపుగొడవలూ, వ్యవసాయపు ముచ్చటలూ మాట్లాడుకొన్నారు మామాఅల్లుళ్లు. బయట వెన్నెట్లో నులకమంచంమీద రమణి వేసిన పక్కమీద పండుకున్న సుబ్బులుకుగాని, లోపల ఈతాకుచాప మీద పండుకున్న రమణికిగాని నిద్రపట్టనేలేదు. అర్ధరాత్రి అయినది. అర్ధచంద్రుడు నెత్తిమీది కెక్కికూర్చున్నాడు. ముసలివాళ్లిద్దరూ బర్రెగొడ్లదగ్గర ఎడంగా కాళ్లమంచాలు వేసుకొని వొడళ్లుమరచారు. మొగకుక్క ఒకటి ఆడకుక్కను వెంబడించి సుబ్బులుని రాసుకొంటూ వేపచెట్టుక్రీనీడకు తరుముకొనిపోయింది. చెట్టుమీద కూర్కుచెందే రెండు పాలపిట్టలు అదిరిపడి లేచి కువకువమని గోలచేస్తున్నవి. శరీరానికి ఉక్కతగిలి మంచంమీదనే లేచికూర్చున్నాడు సుబ్బులు. “మంచినీళ్లు కావలెనా?” అని లోపలనుంచి లేచివచ్చి అడిగింది రమణి. జవాబివ్వకుండగనే, సుబ్బులామెరెండుచేతులూ పట్టుకోగా ఆమె వెనక్కిమొఖంతిప్పి వొరిగింది. ఆమెతో లేచినిలబడి ఇద్దరూ పక్కనే చిలకలేరుకు పరుగుపెట్టారు.

వరదకు కొట్టుకొనివచ్చి కరడుకట్టిన యిసుకతిప్పపై బరువుగా పడే చిక్కని చంద్రకాంతి కరడుగట్టుతోంది. తిప్ప ఎక్కి ఒకరి చేతు లొకరు పట్టుకొని, ఎదురుముఖమై, “రమణీ!.........”అని పిలిచి ఏమిటో చెప్పబోయాడు సుబ్బులు.

అదివర కెన్నిసారులు చూచుకోలేదు ఆ రమణి తన మామను! కాని ఆరాత్రి వెన్నెలకళలలో వెలిగిపోయే మామ రమణికి ఒక దేవతాపురుషుడులా ప్రకాశించిపోతున్నాడు. ఒక సన్నని లేతకిరణం అత

గాడి చిరునవ్వు పెదవులపై లేతమీసంమీదుగా పసిరిక పాములా పాకిపోయింది.

"మామా! ఎంతకాలమని అక్కడ నీవూ, ఇక్కడ నేనూ ఇట్లా పడివుండడం?" అని అడిగింది రమణి.

పాపమెరగని వయస్సులో రమణి సుబ్బులు పెండ్లామై పుట్టిందని వరసయినవాళ్లు పరియాచకాలు పలుకుతుంటే, లేగదూడవలె నిక్కపటపుచూపు చూచి తెల్లబోయేవాడు. కాని, ఈనాడు రమణి సుబ్బులు భార్యగా పుట్టినమాట నిజమేనని ఘట్టి చేసుకొన్నాడు సుబ్బులు.

రమణి యీనాడిసంఘాల ప్రాపకంచేత ఇంత కాలం చదువుకొని డొక్కశుద్ధిలేని తనని పెండ్లి చేసుకొంటుందా అని అప్పుడప్పుడు తనకి దిగులుపుట్టి, అంతలోనే ఆ దిగులు ఆరిపోతూండేది. తనవద్దనుండి ప్రస్తాపన లేకుండగనే, మేనమామే కబురుచేసే వరకు సుబ్బులుకు మేరువు దొరికినట్లనిపించి ఇంటి కాడ నిలవలేక ఎగిరివచ్చిపడ్డాడు. అట్టి పర్వదినం నాటి రాత్రి, ఏకాంతంలో రమణే వచ్చి తన చేతులలో కరిగిపోతున్నది. చిలకలేరులో అననుభూతమైన ఒక ఆనందమయ ప్రవాహం గట్లుతెగ్గొట్టుకొని ప్రవహించి, సుబ్బుల్ని ముంచెత్తి వేస్తున్నది.

"రమణీ! నువ్వు చదువుకొన్నావు. నాకు చదువురాదు. నన్ను నీవు పెండ్లిచేసుకొంటావా?" అని దీనంగా అడిగేడు సుబ్బులు.

"మామా, నేను చదువుకొన్నది నిన్ను పెళ్లి చేసుకొనేందుకే. నా చదువులో నేను మననం చేసింది నీస్వరూపమే." అన్నది రమణి.

ఆమెరెండుచేతులూ ఎత్తి పెదవులతో స్పృశించి కళ్లు మూసుకొన్నాడు సుబ్బులు. ఆస్పర్శ సుఖానుభూతికి కన్ను లరమోడ్పుమూతపడి తన ప్రియుని వక్షస్థలంపై వాలిపోయింది రమణి.

చంద్రుడు మబ్బుచాటుకు పోయి క్రింది వాళ్లకు తెరగప్పేవరకు, తెరమాటున రమణీ సుబ్బులు చిలకలేరు ఇసుకతిప్పనే ఆశ్రయించుకొని, సృష్టిలోని నిశ్శబ్దం భయంకరమనిపించేవరకు "ఇంక ఇంటికి పోదామ"ని లేచి రమణి తన యింటికీ, సుబ్బులు రెడ్డిగారి పల్లెకూ పయనమై వెళ్లి పోయినారు.

౫

ఎప్పుడు తిరిగి యింటికి చేరుకొన్నాడో సుబ్బులు— తెల్లవారి లక్ష్మమ్మ నిద్రలేచేసరికి, పడమటావుకు దాణాపెట్టి, దూడనివిడిచి, వెనక కాళ్లకు బందం వేసి, మోకాళ్లసందున మానికతప్పేలా పెట్టుకొని, తేనెటీగల మోతగా, జుంయ్యి జుంయ్యిమని పిండుతున్నాడు పాలు.

"రాత్రే వచ్చావేమిటిరా కమ్మవారిపాలెం నుండి? మరి రాత్రి అన్నానికి రాలేదేం?" అని అడిగింది లక్ష్మమ్మ.

"వేకువజామున లేచివచ్చాను. రాత్రి అక్కడనే ఉండిపోయాను." అన్నాడు సుబ్బులు.

"పెండ్లిమాట ఏమయిందీ?"

"రెడ్డిగారిపల్లె వెళ్లి లగ్నం పెట్టించుకొని రమ్మన్నాడు మామ." అంటూ నురుగునిండిన మానికతప్పేలా చేతపట్టి, బందంవిప్పి, దూడని విడిపించాడు సుబ్బులు.

పాలచెంబు చేతిలోకి అందుకొని, "అయ్యగారిని పిలిపించి, లగ్నం పెట్టిస్తానుండు." అని లక్ష్మమ్మ యింట్లోకిపోయింది. చద్దినీళ్లు త్రాగి సుబ్బులు పొలంపోయి పైటన్నానికింటికి రాంగనే—

"సుబ్బులూ! రేపు పున్నమివెళ్లిన దశమికి మంచి లగ్నం ఉన్నదటరా. అయ్యగారు వచ్చి లగ్నం కాగితంమీద వ్రాసి కోడలి కిచ్చిపోయాడు." అని సుబ్బులుతో చెప్పింది లక్ష్మమ్మ.

సుబ్బులుశరీరం తేలికయిపోయి, "ఇంకెన్నాళ్లున్నదో?" అని అడిగాడు.

"ఆరోజూ, ఈరోజూగాక నడుంగా పదిహేను రోజు లున్నదని చెప్పాడు అయ్యగారు." అన్నది లక్ష్మమ్మ.

అన్నం తిని వెళ్లిపోయాడు సుబ్బులు.

రమణిని పెళ్లిచేసుకోవాలని సుబ్బులు కెంత ఆత్రంగా ఉన్నదో, వాడు పెండ్లిచేసుకొని, పెళ్లికూతురుని ఇంటికి తీసుకొనిరాగా చూడాలని లక్ష్మమ్మకూ అంత ఆత్రంగా ఉన్నది. మళ్లా తన రెండో కొడుకు పచ్చనిగుడ్డలు కట్టుకొని ఇంకో

కోడల్ని ఇంటికి తీసుకొనివస్తున్నట్టే ఆయిల్లాలి ఆనందం.

పెళ్లిరోజు ఎప్పుడు వచ్చినా అన్న ఆత్రమే గాని—ఆపెళ్లి కేయే సంభారాలు కావాలో, తానేమేమి తీసుకొనిపోవాలో, తనకు డబ్బెంత కావాలో, ఆకావలసిన డబ్బు లక్ష్మమ్మనే అడగాలో, రామిరెడ్డినే అడగాలో — ఈ ఆలోచనే తట్టలేదు సుబ్బులుకు. వీడి పెళ్లితాపత్రయం అంతా లక్ష్మమ్మ మాత్రం ఆక్షణం లగాయతు నెత్తినవేసుకొని అదే ప్రయత్నంలో పడిపోయింది. "పెళ్లిచేసుకొని వస్తే, ఈ యానాదివాడు ఆ పిల్ల నెక్కడ పెట్టడం?" అని లక్ష్మమ్మకు ఆలోచన పుట్టింది. పాపడుండంగా అరటితోటలో కాపరం చేసే చుట్టుగుడిశ వాడు చనిపోయిన తర్వాత ఏనాడో శిథిలమై పోయింది. అది లగాయతు సుబ్బులు రెడ్డిగారింట్లోనే తిని తిరుగుతుండినందున, వాడికి ప్రత్యేకంగా గుడిశవేసుకోవాలన్న ఆలోచనా కలగలేదు, అవసరమూ కనిపించలేదు. తను ఏకాకి. చీకటిపడితే రాత్రిపూట ఏపాలంలోనో, రెడ్డిగారి ధాన్యపు కొట్లదగ్గరనో, పశువులసాలలోనో ఎక్కడ పండుకుంటే తెల్లవారదు. కళ్లమీది రెప్పలు బరువెక్కితే ఆసమయానికి తలమీద గుడ్డ తలకింద పెట్టుకొని వీరానుస్వామి దేవళంఅరుగుమీదనో పండుకొని వెళ్లదోసుకొంటున్నాడు సుబ్బులు.

భార్యను తీసుకొని వచ్చేలోపల సుబ్బులుకు ప్రత్యేకంగా ఒక "ఇల్లు"అని ఏర్పాటుచేస్తేనేగాని వీలులేదని, ఆరాత్రి భోజనాలవేళ ఈసంగతి రామిరెడ్డితో ప్రస్తావనచేసి, అరటితోటకి తూర్పుగా ఆనుకొనిఉన్న కొబ్బరితోటలో ఈశాన్యమూలన ఓ రెండుదూలాల పూరికొట్టం వేయించడానికి నిశ్చయించుకొన్నది లక్ష్మమ్మ. సుబ్బులుతోనే చెప్పి తన తాటితోపులో చేవగల రెండు తాటిమానులు నరికించి, వడ్డెవాళ్లను పిలిపించి తాను దగ్గరఉండి గుణావర్తనం త్రవ్వించి, కీట్లు తీయించి మట్టిగోడలు పెట్టించింది. కంసాలిబత్తుణ్ణి పిలిపించి పశువులకొట్టంలో అటకమీద ఆరబెట్టిన పాత వేపకొయ్యలు క్రిందికి దింపించి, తలుపూ, ద్వారబంధం, రెండు కిటికీలూ చేయించి, గోడలికి బిగించింది. తనదగ్గర సమయానికి నిలవలో లేకుంటే, మిట్టమీది పల్లెకు బండ్లు పంపించి రెండుబళ్ల సజ్జచొప్పా, విడవలీ, రెండుబళ్ల అడివివాసాలూ తెప్పించి, పైకప్పూ, చూరూ కప్పించి, ముత్తానికి పెళ్లి అయిదురోజు లుందనంగా సుబ్బులుకాపరానికి యిల్లు కట్టించి వాణ్ణి పిలిచి, "సుబ్బులూ! ఈఇల్లు నీదిరా" అని వాడి కప్పగించింది లక్ష్మమ్మ.

ఏమిసమాధానం చెప్పాలో వాడి కర్థంగాక, "నీచలవ తల్లీ."అని దణ్ణం పెట్టి ఊరుకున్నాడు.

రామలింగేశ్వరస్వామిఆలయానికి సంబంధించి కమ్మవారిపాలెంలో ఉన్న ఏభయ్యెకరాల మాన్యం విషయమై ఇటీవల ఆవూరుకమ్మవారికీ, దేవళం ధర్మకర్తఅయిన తనకూ దావాలూ తగవులూ పడి, ఆసందర్భంలో హైకోర్టులో వాయిదాఉండినందున వారంరోజులక్రిందటనే చెన్నపట్నం వెళ్లిపోయాడు రామిరెడ్డి. "తెల్లవారితే మూడురోజులే ఉన్నది పెళ్లికి గడువు. మేము సర్వసిద్ధం చేసుకొన్నాం. తెల్లవారితే పెళ్లి అనగానే యిక్కడికి చేరుకోవా"లని కబురు చేశాడు మేనమామ జువ్వడు. తనపేరిట యిల్లని ఒకటి ఏర్పడింది గదా, రమణి వస్తే గృహప్రవేశం కావడమే తరవాయి అని ఉరకలువేస్తున్నాడు సుబ్బులు.

"రామిరెడ్డి పట్నంనుండి రాలేదని కూర్చుంటే అయినట్టే"నని అంటూ ఎప్పుడు తెప్పించిపెట్టిందో-తెల్లవారితే పెళ్లి అనగా ఈరోజు ఉదయం సుబ్బులుకు తలకు నీళ్లు పోయించి, కొత్తపంచెల జామారు కట్టబెట్టి, కాళ్లకు పసుపూ పారాణీ పూయించి, ఆనాడు పప్పూ పరమాన్నం వండి పండగచేసింది లక్ష్మమ్మ. మధ్యాహ్నం తరలివెళ్లేటప్పుడు సుబ్బుల్ని లోపలికి పిలిచి "ఇదిగో, ఈపాతికరూపాయలూ దగ్గర ఉంచుకో. అవసరమైతే ఖర్చుపెట్టుకో. ఈచీర తీసుకొనివెళ్లి పెళ్లికూతురుకు కట్టబెట్టు"అని సుబ్బులుచేతికిచ్చింది.

మొలకి కొత్తపంచె, పైకి కొత్త ఉత్తరీయం-ఏమి! సుబ్బులుజాతకం! ఆగడ్డమీద అజివర కే యానాదివాడికి పట్టింది ఈమహద్దశ! తనపాలిట ప్రత్యక్షదైవమువలె గోచరిస్తోంది లక్ష్మమ్మ. సుబ్బులుకు జోటజోట కన్నీరు కారి, గద్గదం పడి, నోట మాట రాక, నిలువునా మోకాలిమీద వొంగి, లక్ష్మమ్మపాదాలు కళ్లకద్దుకొని నిలబడ్డాడు.

రెండుచేతులూ అతని చెంపలమీదుగా తిప్పి, తనచెంపన పెట్టుకొని వేళ్లు విరిచి, "నాయనా!

వెయ్యేళ్లు వర్ధిల్లు. తొందరగా పెళ్లి చేసుకొనివచ్చి బిడ్డల తండ్రివి కా" అని దీవించి, "ఆ మహరాజు ఉంటే చూచి ఎంత ఆనందించేవాడో! 'సుబ్బులంటే యానాదివాడటే! వాడు రత్నం' అని, ఊ, పొంగిపోయేవాడు."అని తన భర్త కృష్ణారెడ్డిని తలంచుకొని కళ్లు తుడుచుకొన్నది లక్ష్మమ్మ.

సుబ్బులు లేచి నిలబడ్డ తర్వాత—"ఇదిగో! చెయ్యి పట్టు. ముందుగా యిస్తే మరచిపోతావని ఇవ్వలేదు. ఈ కాసు తీసుకొని వెళ్లు. వెళ్లి, రాత్రి గదిలో, పెళ్లికూతురుచీర చెంగుకు కట్టిరా." అని నవ్వుతూ తనతాలూకు పాతసొమ్ముల బాపతు కాసుల పేరులో ఒక బంగారుసవర తీసి, మెరుగుపెట్టించి, పెళ్లికొడుకుచేతిలో పెట్టింది లక్ష్మమ్మ.

నల్లని తన చేతిలో మెరిసిపోయే ఆ బంగారు సవర సుబ్బులుకళ్లల్లో తళుక్కుమని చీకట్లుకమ్మేసింది. "రాత్రి", "గది" అని లక్ష్మమ్మ అనేసరికి వల్లమాలిన సిగ్గుపుట్టి, కళ్లు నేలచూస్తూ తలకాయ వంచి అట్లనే నిలిచిపోయాడు సుబ్బులు.

"భద్రం: జాగ్రత్తగా పెట్టుకో: మరిచేవు సుమా." అని పదేపదే హెచ్చరించి సాగనంపింది లక్ష్మమ్మ.

౬

లక్ష్మమ్మదీవెన లందుకొని పెండ్లికొడుకు ఆరాత్రికే కమ్మవారిపాలెం చేరుకొన్నాడు. మామ ఎప్పుడు గుమ్మంలో అడుగుపెట్టుతాడా అని ఎదురు తెన్నులుచూచే రమణమ్మకు సుబ్బులురాక బ్రహ్మానందమైపోయింది. ఆ యిరువురి జీవితాలలో సర్వోత్కృష్టమైన ఘడియ లవి.

తన తండ్రి ముసలివాడు, కళ్లు కనిపించక బయటకు పోయేస్థితిలో లేనందున ఎంత స్వల్పంగా చేసుకొందామనుకొన్నా, పెళ్లి కార్యాలన్నీ రమణీ, ఆమె తల్లీ స్వయంగా చూచుకోవలసివచ్చింది. ఆమె అన్న ఉండికూడా మిలిటరీలో చేరి సమయానికి అక్కరకు రాకుండాపోయినాడు. ఆ పూరికొంపకే లోపలా బయటా మట్టిపూతా, పేడపూతా తల్లీకూతుళ్లే స్వయంగా పూసుకొని, సున్నం కొట్టించుకొన్నారు. ఇంటివాకిట పందిరిపై ఎండిపోయిన పాతబందేడు తడికలు తీయించివేసి, పచ్చని కొత్తతడికలు కప్పి పందిరి బాగుచేయించింది రమణి. ఒక అయ్యను బ్రతిమిలాడి ఇన్ని మామిడాకులు తెప్పించి, తోరణం కట్టించింది పందిరికీ, వాకిలికీని. బడిలో చదువుకొనే హరిజన పిల్లకాయలనూ, యానాదిపిల్లకాయలనూ పెళ్లికి వచ్చి అన్నం తినిపోవలసిందని స్వయంగా పిలిచింది రమణి. ఆ తాలూకా యానాదిసంఘాల కధ్యక్షుడయిన రాఘవయ్యగారిని పెళ్లికి తప్పక రావలసిందని జాబు వ్రాసి పంపింది. ఆ పాలెంలో చదువుకొన్న యానాది పిల్లకు పెళ్లికావడం యిదే మొదటిసారి అయినందువల్ల సంతోషంకొద్దీ పెళ్లికూతురుకోరికప్రకారం హాజరయ్యాడు రాఘవయ్యగారు.

పాఠశాలప్రధానోపాధ్యాయుడు వివాహానికి అధ్వర్యం వహించి మంత్రాలు చదివి శుభలగ్నాన రమణిమెడలో సుబ్బులుచేత మంగళసూత్రధారణ చేయించాడు. పాఠశాల అయ్యవార్లు మొగా ఆడా అందరూ వచ్చారు. గ్రామంలో కాంగ్రెసునాయకులు నలుగురూ వచ్చి రమణీసుబ్బుల్ని దీవించి అక్షతలు చల్లి వెళ్లిపోయారు. పెద్దఅయ్యవారమ్మ-గాంధీగారి ఆశ్రమంలో ట్రెయినింగయివచ్చిన ఆమె - మహాత్ముని ఆత్మచరిత్ర పెళ్లికూతురుకు కానుకచదివించింది. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి"ని రాఘవయ్యగారు చదివించారు.

ఇప్పటి కారుమాసాలుగా తాను స్వయంగా రాటంమీద వడికిన నూలుతో మామ కోపంచా ఉత్తరీయం, తన కోచీరా రవికా నేయించి నెలరోజుల క్రిందటనే తయారుగా పెట్టుకొన్నది రమణి. రాత్రి ఏకాంతంలో మామకి కొత్తపంచలు తను స్వయంగా కట్టబెట్టి, కొత్తచీర తాను ధరించింది. తనకు లక్ష్మమ్మ పంపిన కానుక అని చెప్తూ బంగారుసవర రమణి చేతిలో పెట్టాడు సుబ్బులు.

మూడు నిద్రలూ అయిన తర్వాత పిల్లని తీసుకొని రెడ్డిగారిపల్లె వచ్చాడు. వచ్చీరావడంతోనే కొత్తగుడ్డలతో ఇద్దరూ పెళ్లి ముందు లక్ష్మమ్మకీ, తర్వాత ఆమెకోడలికీ కాళ్లకి మ్రొక్కి వారి దీవెన లందుకొన్నారు. అప్పటి కింకా చెన్నపట్నంనుంచి రానేలేదు రామిరెడ్డి.

లక్ష్మమ్మ దగ్గరఉండి, సుబ్బుల్నీ, రమణినీ కొత్తఇంట్లో గృహప్రవేశం చేయించి, వారి సంసారానికి కావలసిన అన్ని సదుపాయాలూ చేసి పెట్టింది.

రమణికీ, సుబ్బులుకీ చిరకాలం చేసుకొన్న తపస్సు ఫలించిన ట్లనిపిస్తోంది. స్వంతయిల్లు. రమణి తన భార్య; సుబ్బులు రమణిభర్త. ఆమె అతనిప్రియురాలు; అతడు ఆమెప్రియుడు. ఇంట్లో కాపరానికి లోటు లేకుండా సమస్తమూ సప్లయి అయే రెడ్డిగారి ప్రాపకం. ఆహా! ఏమి అదృష్టం!

పూరిల్లు రెండుదూలాల కొత్తం అయినందువల్ల మూడు అంకణాల కొంప. తూర్పుతట్టు అంకణంలో వంటచేసుకోడానికి కేటాయింపుగా దూలంకింద పొడుగునా మేదరతడిక అదివరకే అల్లించి పెట్టించింది లక్ష్మమ్మ. పడమటితట్టు అంకణంలో వాండ్లు నిద్ర చేయడానికి ఒక నులకమంచంకూడా కొత్తది సప్లయి చేసింది ఆయిల్లాలు. ఇంక ఆ సంసారానికి కావలసిన పెద్ద హంగులుమాత్రం ఏమున్నవి? పెట్టుకొంటే ఎన్ని హంగులయినా పెరుగుతూనే ఉంటవి. రామిరెడ్డి పెండ్లికి — ఆ రోజుల్లో, మామగారు అయిదు కావిళ్లతో రూపాయలూ, వెండి బంగారుసామానూ అల్లుడికి కట్నంచదివించి, కూతుర్ని అత్తవారింటికి పంపేటప్పుడు పందిరిపట్టెమంచం, చాందినీ, పరుపులూ, దిండ్లూ, అద్దాలూ, బీరువాలూ, పేకుపెట్టెలూ, అలమరలూ, గుండిగలూ, అండాలూ, బిందెలూ, మరచెంబులూ, గ్లాసులూ, పళ్లేలూ — ఒకటేమిటి, కొత్తసంసారానికి కావలసినవన్నీ, పూచీపుల్లతోసహా అయిదుబళ్లమీద గొప్ప సారెపెట్టి పంపించారట పుట్టింటివారు. ఆ దిగిన సామాను పెట్టుకోను ఇల్లు చాలక, నిత్యసంసారానికి అంత సామానుతోనూ అవసరం కనిపించక, దానిలో ముప్పాతిక సామాను అటకమీది కెక్కించి ఇల్లు ఖాళీ చేయించిందట లక్ష్మమ్మ. రమణి కంత సారె పెట్టడానికి ఆతల్లిదండ్రులకు శక్తిలేదు, ఈ సంసారానికి అవసరమూలేదు. ఎటువచ్చీ రమణి తనతో తెచ్చుకొన్నది తన గుడ్డలూ, పుస్తకాలూ పెట్టుకొనే జాజిచెక్కల పెట్టె ఒకటీ, ఒక రాటమూ, ఏకుల బుట్టాను.

గృహప్రవేశం అయినవెంటనే గుమ్మానికెదురుగ్గా కొంచెం పడమటి వాలుగా గోడకి గాంధీ మహాత్ముని పటం తగిలించి, దానికి ఒక ప్రక్క టంగుటూరు ప్రకాశంగారి పటం, రెండోప్రక్క పట్టాభి సీతారామయ్యగారి పటం కొట్టింది రమణి. ఆప్రక్కనే తగిలించింది యానాది సంఘాధ్యక్షుడు రాఘవయ్యగారి పటం. ఇంతకుమినహా ఆమెతోకూడా తెచ్చిన సామానేమీ లేదు. ఇంతా చేస్తే, ఒక్క మహాత్ముని పటానికి తప్ప మిగిలిన పటాలకు ఫోటో చట్టాలేగాని, అద్దాలు లేనేలేవు. వేయించుకొందా మంటే వాళ్ళకు శక్తి లేకపోయింది; అసలు అద్దం పెంకు కరువూ అయిపోయింది.

ఇంట్లో ఉండేది ఇద్దరు మనుష్యులు. ఉదయమో అర్థశేరూ, రాత్రికో అర్థశేరూ బియ్యంనూకలు ఉడకవేసుకొంటే ఎక్కటిక్కలు. అన్నం వండుకొనేందుకు ఒక కుండా, కూరకి ఒక అటికా, పులుసుకాచుకోను ఒక ముంతామాత్రం తెప్పించింది రమణి. ఇత్తడిపాత్రలు తెప్పించియిస్తానని లక్ష్మమ్మ తొందరపెట్టిందిగాని వాటితో వంటచేయడం తన కలవాటులేదని వద్దని చెప్పింది. ఆఖరుకి మంచినీళ్లు త్రాగడానికి రెండు కంచుగ్లాసులయినా తీసుకొంటేనేగాని వీల్లేదని, రమణి వద్దంటున్నా, రెండు గ్లాసులూ, ఒక యిత్తడిచెంబూ కొనిపంపించింది లక్ష్మమ్మ. లోపల మంచినీళ్ళ కోబుంగా, ఒకకడవానూ. బయట స్నానాల కొక బానా, నోరువెడల్పు తొట్టీని. దానితో రమణీసుబ్బుల సంసారం కొల్లబోతున్నది. "ఇంకేమీ వద్దు. మా విషయమై మీరుశ్రమపడకండత్తా" అని రమణి లక్ష్మమ్మని గడ్డంపుచ్చుకొని బ్రతిమిలాడింది.

వ్యవహారం పనిమీద రెడ్డి చెన్నపట్నం వెళ్లితే మట్టుకు వ్యవసాయపు జవాబ్దారీ సుబ్బులుకు తప్పేతుందా? ఆమాటకి వస్తే, రామిరెడ్డి ఊళ్లోలేనపుడే సుబ్బులుకు జవాబ్దారీ ఇబ్బడయిపోతుంది. పుష్యమాసంలో పెద్దపండగ వెళ్లిపోయిన వెంటనే కోతలందుకొంటేనేగాని చేలన్నీ నిండుపంటమీద ఉన్నవి పాడయిపోతవి. కోతలనాటికయినా రెడ్డి వస్తాడో రాడో! ఆయన లేకుండానే తాను స్వతంత్రించి రమణిని పెళ్లిచేసుకొని కాపరానికి తీసుకొని వచ్చినందుకే సుబ్బులుకు గుండెలు పీచుపీచుమంటున్నవి. కొడుకు నడిగే యిల్లు కట్టించియిచ్చానని లక్ష్మమ్మ ధైర్యం చెప్పుతున్నదిగాని తాను ఆయింట్లో ప్రవేశించే నాటికయినా రెడ్డి వచ్చి ఉంటే ఎంత బాగుండేది అని వాడి కదే ఆలాపన. అయినా లక్ష్మమ్మ కష్టసుఖాలు తెలిసిన పెద్దవరస మనిషిగాని చిన్నపిల్లకాదుగదా! ఇంటిపెత్తనం తనమీద ఉన్నప్పంటికీ, ఈవిషయంలో లక్ష్మమ్మ

మాట కాదనడానికి రెడ్డికి నోరెట్లావస్తుందీ? మరేమీ భయంలేదులే అని గుండెనిబ్బరం చేసుకొన్నాడు సుబ్బులు. ఇంతలోనే, తాను పట్నంనుండి యింకా పదిహేనురోజులవరకూ రావీలులేదనీ, సుబ్బులునే కూలీలను మాట్లాడి కోతలు పట్టించవలసినదనీ రామిరెడ్డి జాబు వ్రాయనే వ్రాసేడు. ఇంక నేంభయం!

పెద్దపండగ వెళ్లి, కనుమూ, ముక్కనుమూ గడచినమరునాడే సుబ్బులు కోతలారంభించి, మామూలుప్రకారం ఏ యే చేలో వేయవలసిన కుప్పలు ఆయాచేలో వేయించి, పదిపదిహేనురోజులకే సాఫుసీదా పంటఅంతా ఒబ్బిడిగా అమర్చిపెట్టేశాడు. తాను పగలూ రాత్రీకూడా కుప్పలూ, కయ్యలూ అజమాయిషీ చేసుకొనివస్తున్నాడు. కోతలు కోయడంతోనే, కయ్యల్లో తడి ఆరకుండా కొన్నిట్లో ఉలవా, కొన్నిట్లో జనుమూ, మరికొన్నిట్లో పిల్లిపెసరా-పశువుల మేతకు కొయ్యకాలుమీదనే విత్తనాలు చల్లించివేశాడు. అక్కడక్కడ చవిటికయ్యలు కొన్ని ఏర్పడి కాస్త సత్తువ పెట్టినగాని పనికిరావని కనిపించే కయ్యల్లో సత్తువకోసరం నీలివిత్తనాలూ, వెంపలాకూ చల్లించి, మొక్క మొలిచేవరకూ, ఒకటి రెండు తడ్లు నీళ్లుకూడా పెట్టించి, కట్టుదిట్టం చేశాడు. సుబ్బులు కీనాడు కొత్తగా నేర్పవలసిన విద్యగనకనా! కంట్లో వత్తి వేసుకొని ఖామందుకమతం కనిపెట్టుకురావడం వాడికి వెన్నతో బెట్టిన విద్య.

రమణి కాపరానికి వచ్చి నెలరోజు లయినది. కొత్తకాపరం. ఎంతకాలంగానో తపస్సుచేసి చేసుకొన్న పెనిమిటి సుబ్బులన్నమాటేగాని, రెడ్డిగారి పల్లెలో కాలుపెట్టినదిలగాయతు చూస్తుందిగదా, తన మామకు తీరికే కనిపించదు. వేకువన కోడికూతతో లేచివెళ్లిన వెళ్లడం, పొలంనుండి రెండుబారల పొద్దెక్కేవరకూ చద్దన్నానికే రాడు. చద్దినీళ్లు త్రాగి మళ్లా వెళ్లితే పైబన్నానికి ఒకరోజు ప్రాప్తిఉంటే ఇంకోరోజు ఉండనేఉండదు. అందులో వరికోతలు కూడా వచ్చిపడ్డాయోఏమో, చిక్కంగా చీకటిపడి గూటిలోని పక్షులు కూర్కుపెట్టినగాని ఇంటికి చేరలేకపోతున్నాడు. పగలంతా ఎండా, గాలీ అతగాడి పాలయిపోతున్నది. ఇంటికి చేరి ఉడుకునీళ్లు పోసుకొని నులకమంచంమీద నడుమువాలిస్తే మళ్లా కోడికూతతోనే మెలకువ అతనికి. తన తండ్రిగారింటికాడ వాళ్లుకూడా వొళ్లు అమ్ముకొని బ్రదికేవాళ్లయినా, ఈవిధంగా నెత్తురూ మాంసం హరించిపోయేటట్లు కష్టపడగా తానుచూచిన గుర్తులేదు రమణికి.

"ఏమిటిది మామా ఈ పనీ? వేళకు కూడూ నీళ్లూ అమరకపోతే వొళ్లు చెడిపోదూ?" అని తను అంటే-"ఎద్దులకు గాలికుంటు తగిలినందువల్ల వైద్యుడికోసరం పొరుగూరు వెళ్లివచ్చాననో, రెడ్డిగారింట్లో పొయ్యిలోకి కట్టెలు లేకుంటే తోపులో తాటిమట్టలు కోయించి యింటికి తోలిస్తున్నాననో, లేక రెండెద్దులబండికి ఇనపపట్టాలు వొదులయి తొలిగిపోతే కమ్మరికొలిమికాడ కాపించివస్తున్నాననో—" ఒకటేమిటి, ఎప్పటికప్పుడే ఏదో సాకు చూపించి ఆమె నూరటపెట్టుతున్నాడు సుబ్బులు.

పెనిమిటి కష్టపడుతుంటగా చూడలేకపోతున్నది ఆ పసియిల్లాలు. తానుకూడా పెనిమిటితోపాటు పోయి, సమానంగా కాయకష్టం చేసి అతనిలో భాగం పంచుకొంటే బాగుండును. ఇంటిపట్టున తాను రాణివాసం చేయడం, తన భర్త చెమట ఊడ్చి కష్టం చేయడమూనా? పెనిమిటితోకూడా వేకువనే లేస్తుంది. మెడలోని పుస్తె కళ్ల కద్దుకొంటుంది. గాంధీగారి పటందగ్గరకు పోయి మోకరించి నమస్కరిస్తుంది. ముఖం కడుక్కొని పాచిపని చేసుకొంటుంది. సుబ్బులుకి చద్దన్నం పెట్టి, తానింత తిని, అతను వెళ్లిన తర్వాత వాకిలి బిగించి ఒకసారి రెడ్డిగారింటికి వెళ్లి అక్కడ చెంబు ఇక్కడా, ఇక్కడ బిందె అక్కడా పెట్టి పనికల్పించుకొంటుంది. రెడ్డిగారి పిల్లలకు తలదువ్వి జడలేసి స్నానం చేయిస్తుంది. రెడ్డిగారి భార్యకు భావిలో నీళ్లు తోడిచ్చి, ఆమెస్నానం అయ్యేవరకూ అక్కడనే ఉంటుంది. లక్ష్మమ్మదగ్గరకు పోయి కూరానారా తరిగియిచ్చి ఏవేవో ముచ్చటలు చెప్పతుంది. పొద్దు నెత్తిమీదికెక్కేవరకు ఇంటికి వచ్చి వంటచేసి పెనిమిటి వచ్చేవరకూ ఏ పుస్తకమో, ఏ రాటమో పెట్టుకొని కూర్చుంటుంది. చీకటిపడగానే ప్రమిదలో వేపచమురుదీపం వెలిగించి గాంధీగారిదగ్గర పెట్టి ఏవో వెర్రిమొర్రిపాటలు పాడుకుంటుంది. పెనిమిటి ఇంటికి రాంగనే అతగాడికి వేడినీళ్లతో స్నానంచేయించి అన్నం పెట్టుతుంది. ఇదీ ఆమెదినచర్య.

[తరువాయికథ తరువాతి సంచికలో]